క్లుప్తంగా

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగిసేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షించారు.

16న కుసుమ ధర్మన్న సాహిత్య సేవా పురస్కారాల సభ

విజయవాడకల్చరల్: సాహితీవేత్త కుసుమ ధర్మన్న సాహిత్య సేవా పురస్కారాల సభను ఈ నెల 16వ తేదీన బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్మన్ డాక్టర్ రాధా కుసుమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి గానూ పత్రికా సంపాదకుడు కలిమిశ్రీకి సేవా పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి, జానపద వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, సినీ గేయ కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ పాల్గొంటారన్నారు. సభ అనంతరం జరిగే కవి సమ్మేళనంలో కవులు పాల్గొనాల కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికకు చెందిన కుంటముక్కల ఝాన్సీరాణి(48) అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం కింద తాత్కాలిక ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. మిగతా బీమా నగదును ఝాన్సీరాణి కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో త్వరలో జమవుతాయని అడ్మిన్ రాజు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ మురళీ, నాయకులు అక్కిశెట్టి నారాయణ, వెంకటేశ్వరమ్మ, సచివాలయ కన్వీనర్ కిరణ్, గృహ సారథులు సత్తార్, సీతారామయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాడులు



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాడులు నిర్వహించారు. 61, 62, 63, 64 డివిజన్లలోని షాపుల్లో విక్రయిస్తున్న ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వస్తువులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై ప్రభుత్వం నిషేధం ఉన్నందున వాటిని విక్రయించరాదని షాపుల నుంచి అపరాధ రుసుం కింద 10 షాపుల నుంచి 20 వేల రూపాయలను వసూలు చేశారు. దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కృష్ణారావు, సూర్యనారాయణ, రామకోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



పాయకాపురం(విజయవాడరూరల్): మదర్ ఇండియా ఆటో స్టాండ్ సభ్యుడు షేక్ గాలీబ్(55) ఇటీవల మృతిచెందాడు. అతని కుటుంబానికి 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి మంగళవారం రూ.5 వేలు, ఆటో స్టాండ్ తరఫున రూ.33 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఆటో స్టాండ్ గౌరవాధ్యక్షుడు, కార్పొరేటర్ జానారెడ్డి, స్టాండ్ ప్రెసిడెంట్ మేకల రంగారావు, సెక్రటరీ ఆర్.కోటేశ్వరరావు, స్టాండ్ సభ్యులు పాల్గొన్నారు.

70 మందికి వైద్య సేవలు

గన్నవరం రూరల్: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ప్రజలకు వరమని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యులు శివప్రసాద్ చెప్పారు. మంగళవారం మాదలవారిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 70 మంది రోగులకు వైద్య సేవలందించారు. ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఏఎన్‌ఎం మేరీ గ్రేస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

చిట్టచివరి గడపకూ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- 30వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ జానారెడ్డి, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుల మతాలు, రాజకీయాలకతీతంగా చిట్టచివరి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ 246వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. నవరత్నాల కార్యక్రమాల ద్వారా ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పిచ్చోడి చేతిలో రాయిలా.. వారాహి యాత్ర

అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పనిగట్టుకుని చేస్తున్న వరుస విమర్శలపై తీవ్రంగా స్పందించారు. పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు. యాత్రలో పవన్ తన విధానాలను చెప్పుకోవాలి కానీ, ఇతరులను దూషించడం సరికాదన్నారు. పవన్ కళ్యాణ్‌కు మామూలుగానే తిక్క ఉంటుందని.. అది కాస్త పైత్యంగా మారిందని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నైతిక విలువలను పవన్ దిగజారుస్తున్నారని.. పదే పదే నోరుజారుతూ ప్రజాకోర్టులో దోషిగా నిలబడుతున్నారని వ్యాఖ్యానించారు. చివరకు సేవా దృక్పథంతో పనిచేస్తున్న వ్యవస్థను.. ఊడిగం చేసే వ్యవస్థగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందిస్తే.. వారి త్యాగాలను కించపర్చడం హేయమని విష్ణు అన్నారు. వలంటీర్లలో 70 శాతం మంది మహిళలు ఉన్నారని.. వారి మనోభావాలు కించపరిచే విధంగా జనసేన అధినేత ప్రసంగాలు ఉన్నాయని మండిపడ్డారు.

చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ యాక్షన్

జగనన్న సురక్ష క్యాంపులకు రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న విశేష స్పందన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని ఎమ్మెల్యే విష్ణు ఆరోపించారు. వలంటీర్ వ్యవస్థపై తొలి నుంచి చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ విషం చిమ్ముతోందని.. బాబు డైరెక్షన్‌లో జనసేన అధినేత వలంటీర్ వ్యవస్థపై ముప్పేట దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. పథకాలకు అర్హులను చేసే క్రమంలో సేకరించే డేటాను.. సంఘవిద్రోహ శక్తులకు వలంటీర్లు అందిస్తున్నారంటూ పవన్ మాట్లాడటం తగదన్నారు. ఏ ఆధారాలతో వలంటీర్లపై ఆరోపణలు చేశారో సమాధానం చెప్పాలన్నారు. వలంటీర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల ఆగ్రహ జ్వాలలకు గురికాక తప్పదని హెచ్చరించారు. ఏఎంఓహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సీడీవో జగదీశ్వరి, కార్పొరేటర్లు కుక్కల అనిత, శర్వాణీమూర్తి, నాయకులు మార్తి చంద్రమౌళి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్ పాత్ నిర్మాణ పనుల పరిశీలన



ఫుట్‌పాత్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని బందరు రోడ్డులో గల దూరదర్శన్ ఆఫీసు వద్ద జరుగుతున్న కారిడార్ ఫుట్ పాత్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. నగరంలో ఉన్న అన్ని ప్రధాన జంక్షన్లు అభివృద్ధి పరిచే విధంగా విజయవాడ నగరపాలక సంస్థ కృషి చేస్తోందని, నగర పరిధిలో రూ. కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు జరుగు తున్నాయన్నారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి



31వ డివిజన్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు, వలంటీర్లు



సింగ్‌నగర్‌లో ర్యాలీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీశైలజ, వలంటీర్లు

- వార్డు వలంటీర్ల డిమాండ్
- పవన్ వ్యాఖ్యలపై రెండో రోజూ కొనసాగిన నిరసన కార్యక్రమాలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): వలంటీర్లు, మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వార్డు వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలపై నియోజకవర్గ వ్యాప్తంగా రెండో రోజైన మంగళవారం వలంటీర్ల నిరసనలు కొనసాగాయి. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్లను నోటికి వచ్చినట్లు మాట్లాడటం పవన్ కళ్యాణ్ తీరును తెలియ జేస్తోందన్నారు. చేసిన తప్పును సరిదిద్దుకోకుండా పవన్ కళ్యాణ్ చేసిన తప్పును సమర్థించుకోవటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పవన్ తీరు మార్చుకోవాలని లేనిపక్షంలో వలంటీర్లు, మహిళల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వలంటీర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు సంఘీభావం తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలు అందించిన వలంటీర్లను నోటికి వచ్చినట్లు మాట్లాడటం పవన్‌కు తగదన్నారు. దేశం యావత్తూ వలంటీర్ల సేవలను కొనియాడుతూ ఆదర్శంగా తీసుకుంటుంటే ప్రజల్లో ప్రభుత్వానికి వస్తున్న పేరు చూసి ఓర్వలేక బురద చల్లేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం, నాయకులు ఏ విజయ్, దినేష్, వెంకటేశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో నిరసన ర్యాలీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సరికాదని, రాష్ట్ర ప్రజలు పవన్‌ను చెప్పుతో కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో పవన్ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం సాయంత్రం వలంటీర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షాహీనా సుల్తానా, పెద్ద సంఖ్యలో వలంటీర్లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీసం మహిళలు అనే విచక్షణ లేకుండా పవన్ నోటికి వచ్చినట్లు నీచంగా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ కళ్యాణ్ నడుస్తారన్నారు. చంద్రబాబు చెప్పడంతోనే పవన్ ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. మహిళల జోలికి వస్తే క్షమించేది లేదని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వలంటీర్లపై వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ తక్షణమే వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనా విజృంభిస్తున్న సమయంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్ దాక్కున్నాడని వలంటీర్లు రోడ్డుపైకి వచ్చి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించారని గుర్తుచేశారు. కార్పొరేటర్ షాహీనా సుల్తానా మాట్లాడుతూ.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కు పవర్ లేదు.. స్టార్ లేదన్నారు. పవన్ దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. పవన్ కళ్యాణ్‌కు మతిభ్రమించిందని అందుకే అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను ప్రజలు తప్పు పడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని సాధించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని, అటువంటి వ్యవస్థపై అవాక్కులు పేలటం పవన్‌కల్యాణ్ దిగజారుడుతనానికి పరాకాష్ట అంటూ ప్రజలు దుయ్యబెడుతున్నారు. వారాహి యాత్ర పేరుతో రాజకీయం చేస్తున్న పవన్‌కళ్యాణ్‌కు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ నాలుగేళ్లలో వలంటీర్లు నిస్వార్థంగా సేవలందిస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ వేయిస్తున్న వలంటీర్ దేవి(ఫైల్)

కోవిడ్ సమయంలో ఆదుకున్నారు..



కోవిడ్ సమయంలో అయిన వారే పట్టించుకోని సమయంలో వలంటీర్ కూనపురెడ్డి దేవి మా ఇంటికి వచ్చి మాకు కోవిడ్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసింది. అలాగే ఎప్పుడు ఏ అవసరం అయినా తనను సంప్రదించాలని సూచించింది. మా ఇంట్లో వారికి కోవిడ్ సోకకుండా ఆరోగ్య సిబ్బందిని ఇంటి వద్దకే తీసుకుచ్చి వ్యాక్సిన్ సైతం వేయించారు. వలంటీర్ ఇప్పుడు మా జీవితంలో ఒక భాగమయ్యారు.

–ఎర్రబోయిన ఈశ్వరి, వంశీ, వెంకటేశ్వరనగర్

వలంటీర్ సేవలు మరువలేం..



కోవిడ్ సమయంలో నిత్యావసర సరుకులు ఇంటికి పంపించటంతో పాటు ఇంటి వద్దకే వైద్యసేవలు అందించటంలో మా వలంటీర్ కూనపురెడ్డి దేవి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేం. ఒక కుటుంబ సభ్యుల మాదిరిగా కలిసి పోయి కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి మాకు అందించిన సేవలు ఎనలేనివి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు చేయలేని సేవలను సైతం వలంటీర్లు అందిస్తున్నారు.

–పాములపాటి చంద్రశేఖర్. హనుమాన్‌నగర్

వీసా మోసాలపై అప్రమత్తత అవసరం



సెమినార్‌లో ప్రసంగిస్తున్న న్యాయవాది శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విదేశాలకు వెళ్లే ప్రజలు వీసా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాసరావు సూచించారు. అమెరికాతో పాటు విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మధ్యవర్తులు తప్పుడు వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వారి పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో బెజవాడ బార్ అసోసియేషన్, కావేటి లా ఫర్మ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇమ్మిగ్రేషన్‌లో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వివిధ దేశాల ఇమ్మిగ్రేషన్ చట్టాలపై అవగాహన కల్పించడం, న్యాయవాద వృత్తిలో ఇమ్మిగ్రేషన్ విభాగంలో ఉపాధి అవకాశాల అవగాహన కోసం సెమినార్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇమ్మిగ్రేషన్ చట్టాలతో పాటు ప్రవాస భారతీయుల న్యాయ వివాదాలు, అంతర్జాతీయ న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని అనుకుంటున్న యువ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. త్వరలో విశాఖపట్నంలోనూ అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. విదేశాల్లో స్థిరపడాలని యోచిస్తున్న విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. యువ న్యాయవాదులు వివిధ దేశాల ఇమ్మిగ్రేషన్ చట్టాలు, అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ సుందర్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే విద్యుత్ వినియోగం



మాట్లాడుతున్న ఈఈ హరిబాబు

పెనమలూరు: వినియోగదారులు నిబంధనల ప్రకారమే విద్యుత్‌ను వినియోగించాలని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు చెప్పారు. యనమలకుదురు సెక్షన్ పరిధిలో మంగళవారం తాడిగడప, పెదపులిపాక, యనమలకుదురులో విద్యుత్ విజిలెన్స్ అధికారులు 36 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈఈ హరిబాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యంపై సమాచారం తెలపాలని, చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యుత్ అధికారులు 3254 సర్వీసులను తనిఖీ చేయగా 97 మంది అధిక లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వారికి రూ. 3.22 లక్షలు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ జి.కమలకుమారి, డెప్యూటీ ఈఈ ఎం.పూర్ణచంద్రరావు, ఏఈ రామ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పంచాయతీలకు రావాల్సిన నిధులు, విధులపై సీఎం జోక్యం చేసుకుని రాజకీయ పార్టీలు, సర్పంచుల సంఘాలతో అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సర్పంచుల సంఘాలు ఐక్యంగా పోరాడాలని, అప్పుడే ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమం మరింత బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాపారావు, కృష్ణమోహన్, పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్, సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

ప్రజలు చైతన్యవంతం కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ సాహితి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జనాభా పెరుగుదల వల్ల నిరుద్యోగం, పేదరికం, ఆహార లేమి ఎక్కువ అవుతాయని దాని వల్ల దేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతాయని డాక్టర్ ఎస్.సాహితి చెప్పారు. అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో మంగళవారం సభ జరిగింది. సాహితి అతిథిగా హాజరై మాట్లాడారు. జనాభా పెరుగుదల వల్ల ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్య రావాలని, అది సాధ్యం కావాలంటే ప్రజలందరూ విద్యావంతులు కావాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మాట్లాడుతూ జనాభా పెరుగుదలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

అధిక జనాభా.. ప్రగతికి అవరోధం



ఉయ్యూరులో జరిగిన ర్యాలీలో చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: అధిక జనాభా.. ప్రగతికి అవరోధమని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉయ్యూరులో ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ నాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణ పాటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, డాక్టర్ తేజస్విని పాల్గొన్నారు. కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి దీప పాల్గొన్నారు. ముదునూరు, బొళ్లపాడు, కలవపాముల, కడవకొల్లు గ్రామాల్లో ర్యాలీలు జరిగాయి. డాక్టర్ శాంతి శివరామకృష్ణ పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశ శ్రేయస్సు, ఆనందమయ జీవనం కోసం కుటుంబ నియంత్రణ పాటించాలని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మాగాంధీనగర్‌లో మంగళవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎన్.ఫణికుమార్, హెచ్‌ఎస్ అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ జి.నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీవీపీకి ఐదు అవార్డులు



అవార్డులు పొందిన విద్యార్థులు

పెనమలూరు: రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీవీపీ సిద్ధార్థకు ఐదు అవార్డులు వచ్చాయని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ విజయవాడ శ్రీపొట్టి శ్రీరాములు చదలవాడ మల్లికార్జునరావు కాలేజీలో ఈ నెల 8వ తేదీన ప్రతిష్టాత్మకమైన రోటరాక్ట్ కార్యక్రమంలో తమ కాలేజీకి ఐదు అవార్డులు వచ్చాయన్నారు. యువజన సేవా సంచాలకులుగా సుజనాచౌదరి, వృత్తి సేవలు అందించిన కంచర్ల రమ్య, ఉత్తమ మహిళా రోటరాక్ట్‌గా కావ్య, ఉత్తమ డిజైనర్‌గా సౌమ్య, సేవా రంగంలో ఎక్సలెన్స్ అవార్డు పీవీపీ సిద్ధార్థ రోటరాక్ట్‌కు అవార్డులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్యామ్ పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్

ఉంగుటూరు: స్థానిక డంపింగ్‌యార్డ్ వద్ద గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ఉంగుటూరు ఎస్‌ఐ జి.రాజు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు డంపింగ్ యార్డు వద్ద ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం వారికి అందింది. ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. అక్కడ వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 3.4 కేజీల గంజాయిని స్వాధీనపరచుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో ఆ యువకులు గన్నవరం మండలం మర్లపాలెంకు చెందిన గరిసెపల్లి మారుతాత్మజ్, గరిసెపల్లి శ్రీరామ్, రామ్‌నగర్‌కు చెందిన మానికొండ దినేష్ గంజాయికి అలవాటుపడి సేవిస్తున్నారని తెలుసుకున్నారు.

ఎస్‌ఐ మాట్లాడుతూ ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు గన్నవరం డీఎస్పీ జయసూర్య ఉత్తర్వుల మేరకు ఉంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి తాగిన, కలిగి ఉన్నా పోలీసులకు సమాచారం తెలియజేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కంకిపాడు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లోని ఖాళీ స్థలాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి బ్యాగులతో పట్టుబడ్డారన్నారు. నిందితులు ఉప్పలూరు గ్రామానికి చెందిన చిన్నం వెంకట నాగరాజు, గన్నవరం మండలం కొత్తపేటకు చెందిన గండికోట శామ్యూల్‌రాజు గా గుర్తించారు. వీరి నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజుపై 2015లో గన్నవరం సమీపంలోని ఓ ఇంట్లో చోరీ, 2019లో జగ్గయ్యపేటలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడగా కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని కోర్టుకు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి తెలిపారు.